క్లుప్తంగా

6న వేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం



పిట్టలవానిపాలెం: మండలంలోని గోకరాజు నల్లిబోయినవారిపాలెం శివారు శ్రీనివాసపురంలో వేంచేసిన శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైత్ర శుద్ధ పౌర్ణమి గురువారం వార్షిక శాంతి కల్యాణ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు గోపీచంద్ తెలిపారు. ఈనెల 5న స్వామికి సుదర్శన హోమాత్మక అష్టోత్తర శతకలశ స్నపన జరుగుతుందని వివరించారు. 6న స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. స్వామికి ప్రత్యేక అలంకరణతోపాటు విశేష పూజలు జరుగుతాయని వెల్లడించారు.

పేదల కోసమే ఆరోగ్యశ్రీ



రేపల్లె రూరల్: పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తున్నట్టు డాక్టర్ రమేష్ చెప్పారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో పట్టణంలోని సచివాలయాల ఆరోగ్య మిత్రలు, ఆరోగ్య కార్యకర్తలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కార్యకర్తలకు ఆరోగ్యశ్రీ పథకం బుక్‌లెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ పథకం డివిజనల్ టీమ్ లీడర్ నీలిమా, ఆరోగ్య మిత్రలు నాగిరెడ్డి, అజయ్‌కుమార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమం కోసం కృషి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున



కొల్లూరులో డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కును అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

కొల్లూరు : మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. సోమవారం కొల్లూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళా సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని స్పష్టం చేశారు. ఈ పథకాలపై ప్రతిపక్ష టీడీపీ విమర్శలు చేయడం తగదని, రూ.2 లక్షల కోట్లను ఏ అవినీతికి తావులేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమచేశారని వివరించారు. అనంతరం మండలంలోని 1,215 డ్వాక్రా సంఘాలకు రూ.13.08 కోట్ల విలువైన వైఎస్సార్ ఆసరా చెక్కును నాగార్జున అందజేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, కొల్లూరు ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వేమూరు మార్కెట్‌యార్డు చైర్మన్ బొల్లిముంత ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు అమిరిశెట్టి శ్రీధర్, సుగ్గున అశోక్, గరిక నీలిమ, బుల్లా నవరత్నం, బావిరెడ్డి వెంకట్రామయ్య, సర్పంచ్‌లు శీలం అంకమ్మరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సూర్యదేవర రామకృష్ణ, కమ్మెల సాంబయ్య, ఘంట శివరంగారావు, అయిల సుబ్బారావు, నర్ర బుల్లిబాబు, కూచిపూడి మోషే, చిలకా ప్రకాశం, కట్టుపల్లి సామయ్య, సంగీతరావు, ఆళ్లమూడి మధు, ఉప్పు శ్రీనివాసరావు, పెదబాబు, కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్ పాల్గొన్నారు.

పేదల వైద్యానికి అధిక ప్రాధాన్యం

కొల్లూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పలువురికి మంత్రి మేరుగ నాగార్జున సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఐదుగురు లబ్ధిదారులకు వైద్యం నిమిత్తం మంజూరైన రూ.2.20లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందించారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు వైద్య సాయం చేసేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని వెల్లడించారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీఓ పార్థసారథి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



పోషక పదార్థాల ప్రదర్శనను పరిశీలిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అందరూ పోషకాహారం తీసుకోవాలని మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. సోమవారం కొల్లూరులో అమృతలూరు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ఆయన తిలకించారు. తక్కువ ఖర్చుతో గృహాలలో అందుబాటులో ఉండే వస్తువులతో అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆహారపదార్థాలను పరిశీలించిన ఆయన పోషకాహార తయారీపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, సీడీపీఓ విజయలక్ష్మి, సూపర్‌వైజర్లు మాధవి, విజయలక్ష్మి, నగరాజకుమారి, రమణమ్మ, శాంతి పాల్గొన్నారు.

నవ్వులు కురి'పించెను'



పెదపులివర్రులో లబ్ధిదారురాలికి పింఛన్ అందిస్తున్న ఎంపీపీ లలిత కుమారి చిత్రంలో వలంటీర్



వేమూరు అంబేద్కర్ నగర్‌లో పింఛన్ అందజేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో సోమవారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. అవ్వాతాతలు, లబ్ధిదారుల మోముల్లో నవ్వులు కురిపించింది. ప్రతినెలా ఒకటో తేదీనే అందే పింఛన్ ఈనెల ప్రారంభంలో రెండురోజులు బ్యాంకులకు సెలవులు రావడంతో స్వల్ప ఆలస్యమైంది. సోమవారం వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించారు. లబ్ధిదారులు ఇంటి వద్ద లేకపోయినా వారు ఉన్న చోటకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. తొలిరోజు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరావు పరిశీలించారు. కొందరు లబ్ధిదారులకు వారు స్వయంగా పింఛన్ నగదును అందించారు.

వేమూరులో..

వేమూరు: వేమూరులో గ్రామ సచివాలయం కన్వీనర్ బుస్సా బుజ్జి పింఛన్లు అందజేశారు. మండలంలో మంగళవారం నాటికి పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని ఇన్‌చార్జి ఎంపీడీఓ సునీత తెలిపారు.

పశు ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రవి

రేపల్లె రూరల్: పశువుల ఆరోగ్యంపై పోషకులు శ్రద్ధ పెట్టాలని సర్పంచ్ మాతంగి రవి చెప్పారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బొబ్బర్లంక పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉచిత పశువైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టిందని, పశు యజమానులు తప్పకుండా వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. 1962కు కాల్‌చేస్తే పశువైద్యులు ఇంటికే వచ్చి చికిత్స అందిస్తారని వెల్లడించారు. అనంతరం పశువైద్యాధికారి మీనాక్షి దేవి 98 పశువులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పోతర్లంక లక్ష్మి, గోపాలమిత్రలు దేవర్షన్, బాపూజీ, గ్రామ పెద్దలు కొడాలి జయప్రసాద్, యలవర్తి వేణుబాబు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల బలోపేతానికి కృషి



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బాపట్ల: పొదుపు సంఘాల బలోపేతానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ 10వ వార్డు ఇన్‌చార్జి ఇనగలూరి మాల్యాద్రి పేర్కొన్నారు. పొదుపు సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సచివాలయం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆసరా లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. ఇనగలూరి మాల్యాద్రి మాట్లాడుతూ ప్యాడిసన్‌పేటలో మూడోవిడత ఆసరా ద్వారా రూ.18.65 లక్షలు పొదుపు సంఘాల ఖాతాల్లో జమ కావటం విశేషమన్నారు. 10వ వార్డులో ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన అభివృద్ధి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మెప్మా సీఓ దగ్గుమల్లి క్రాంతికుమార్, ఆర్పీ సుజాత పాల్గొన్నారు.

చోడిపాలెంలో అన్న సంతర్పణ

చోడిపాలెం(పిట్టలవానిపాలెం): భవనంవారిపాలెం శివారు చోడిపాలెంలో ఆదివారం అన్న సంతర్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సంతర్పణ జరిగింది. శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా ఆదివారం స్వామికి గ్రామోత్సవం నిర్వహించిన అనంతరం అన్న సంతర్పణ చేశారు. తొలుత రామాలయంలో సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు.

రేపు నరసింహస్వామి రథోత్సవం

పిట్టలవానిపాలెం: అల్లూరులోని రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ వాలి వెంకట శివారెడ్డి మాట్లాడుతూ మంగళవారం తెల్లవారుజామున స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 5న అన్నసంతర్పణ జరుగుతుందని, అదేరోజు సాయంత్రం రథోత్సవం ఉంటుందని వివరించారు.

రథం మోకు ప్రత్యేకత: స్వామి రథం 1980లో జరిగిన అగ్ని ప్రమాదంలో పాక్షికంగా కాలిపోయింది. 2004లో కొత్త రథాన్ని తయారు చేశారు. రథం లాగేందుకు మోకు కొనేందుకు చూస్తుండగా నిజాంపట్నానికి చెందిన మత్స్యకారుడికి సముద్రంలో మోకు లభించింది. ఆరోజు స్వామి అతనికి కలలో కనిపించి ఈ మోకును అల్లూరు లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం నిమిత్తం ఇవ్వాలని చెప్పడంతో ఆ వ్యక్తి మోకును ఆలయానికి ఇచ్చాడని స్థానికులు చెబుతున్నారు. మోకు నాగేంద్ర స్వామి పడగను పోలి ఉండడం విశేషం.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

రేపల్లె: స్థానిక రామకోటిపేటలోని రామ మందిర కల్యాణ మండపంలో ఈ నెల 4న వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సోమవారం తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో పట్టణంలోని లబ్ధిదారులు పాల్గొనాలని కోరారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణ మండపంలో వివిధ అభివృద్ధి అంశాలపై సచివాలయాల కన్వీనర్‌లు, కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లతో సమీక్ష నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

రేపు సీతారామయోగిని కల్యాణ మండపంలో..

రేపల్లె రూరల్: స్థానిక పత్తిపాటి సీతారామయోగిని కల్యాణ మండపంలో ఈనెల 5న బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జగనన్న కాలనీలో పైప్‌లైన్ మరమ్మతులు



భట్టిప్రోలు: భట్టిప్రోలు జగనన్న కాలనీలోని లే–అవుట్–1, 2లలో తాగునీటి పైప్ లైన్‌లు, కుళాయిలు దెబ్బతినడంతో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసినట్టు సోమవారం సర్పంచ్ దారా రవి కిరణ్మయి తెలిపారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా ఈ లే–అవుట్లలో జిల్లా స్థాయి అధికారులు లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో తాగునీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకువచ్చారని వివరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎ.శివకృష్ణ పర్యవేక్షణలో పైప్‌లైన్ల మరమ్మతులు సోమవారం చేసినట్టు ఆమె వెల్లడించారు.



